
ప్రజాశక్తి
ఆదివారం 23 జూన్ 2024
5
పార్వతీపురం మన్యం



గుండెపోటుతో ఎంపిపి భర్త మృతి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని మాదిలింగికి చెందిన ఎంపిపి భర్త, వైసిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ శెట్టి మధుసూదన్‌రావు గుండెపోటుతో శనివారం మృతి చెందారు. గత పదేళ్లుగా వైసిపిలో కార్యకర్త స్థాయి నుంచి మంచి ఉన్నత స్థానానికి ఎదిగి రాజకీయంగా పార్టీ కోసం కీలకంగా వ్యవహరించారు. ఆయన మృతితో మండలంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన మృతి పట్ల జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మండలంలోని వివిధ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు సానుభూతిని అతని కుటుంబ సభ్యులకు తెలిపారు.



రుతుపవనాలు ఆగమనం

సాగుకు రైతు సన్నద్ధం

ప్రజాశక్తి - కురుపాం

నైరుతి రుతు పవనాలు ముందస్తుగా రావడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. రుతు పవనాల ప్రభావంతో అక్కడ అక్కడా వర్షాలు పడడంతో పంట పొలాలు పదునెక్కడంతో పంటల సాగుకు అనుకూలమైంది. ఏరువాక సేద్యాలకు సమయం కూడా ఆసన్నమైంది. తొలకరి చినుకులు రావడంతో ఎరువాక సేద్యాలపై అన్నదాతలు దృష్టి సారించారు. పలుచోట్ల దుక్కులకు ఉపక్రమించారు. ప్రకృతి అనుకూలించి, సకాలంలో వర్షాలు వస్తే అన్నదాతకు అంతకు మించిన ఆనందం మరొకటి ఉండదు. ఏరువాక పౌర్ణమి పర్వదినం నుంచి వ్యవసాయ పనులు జరుపుకోవడం రైతన్నలకు అలవాటు. శ్రావణమాసం, కార్తీక మాసం, మాఘ మాసం వచ్చే పౌర్ణమి తరహాలోనే మృగశిర కార్తిలో వచ్చే పౌర్ణమి ఏరువాక పౌర్ణమి అని పిలుస్తారు. ముఖ్యంగా రైతులు ఈ పౌర్ణమిపై మొగ్గు చూపుతారు. ఇక్కడి నుంచి రైతన్నకు ఆదాయ, వ్యయాలు ప్రారంభమవుతాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతుల్లో కూడా



వరి విత్తనాలు వేస్తున్న రైతు

ఉత్సాహం కనిపిస్తుంది. వాతావరణం అనుకూలించడంతో అన్నదాతలు క్షణం తీరిక లేకుండా పాలం గట్లు వైపు పరుగులు తీస్తున్నారు. ఈ సీజన్లో వివిధ రకాల పంటలు సాగు చేయడం పరిపాటి. ఇప్పటికే వ్యవసాయ పరికరాలు కూడా సిద్ధం చేసుకున్నారు.

స్టాప్ డయేరియాను సక్రమంగా నిర్వహించాలి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్


ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పట్టణంలో స్టాప్ డయేరియా కార్యక్రమం జులై 1 నుండి ఆగస్టు 31 వరకు రెండు నెలల పాటు జరుగుతుందని, ఈ కార్యక్రమంలో సచివాలయాల సెక్రటరీలకు, ప్రజారోగ్య సిబ్బందికి, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందికి అప్పజెప్పిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలను ఉద్దేశించి పట్టణంలో ఉన్న అన్ని వార్డుల్లో పూడికతీత పనులు జరుగు వేళల్లో కాలువల్లో ఉన్న సిల్ట్‌ను పూర్తి స్థాయిలో తీయించేలా చూసుకోవాలని సూచించారు. కాలువల్లో యాంటీ లార్వా స్ప్రేయింగ్ మీ వార్డు పరిధిలో అన్ని వీధుల్లో జరిగేలా మీతో పాటు ఎఎన్ఎం బాధ్యత వహించాలన్నారు. లేకుంటే మీపై శాఖపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రధాన రహదారికి ఇరు వైపులా ఉన్న వర్తక,



స్టాప్ డయేరియాపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

వాణిజ్య దుకాణాల దగ్గర డస్ట్ బిన్‌లు పెట్టించేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. డెస్ట్ బిన్‌లు ఏర్పాటు చేయని దుకాణదారులకు అపరాధ రుసుం విధించాలని సూచించారు. సచివాలయ ఎమినిటీ సెక్రటరీలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతిరోజు వార్డుల్లో కుళాయిల ద్వారా నీరు సరఫరా అయ్యే సమయంలో క్లోరినేషన్ పరీక్షలు చేయాలన్నారు. అలాగే వాటర్ ట్యాంకులు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రాంతాల వారీగా కుళాయి లీకులను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేయించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.మురళి, ఎఎస్ఒ వీరునాయుడు సంబంధిత సెక్షన్ గుమస్తాలు పాల్గొన్నారు.



పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయంలో నేత్రోత్సవం చేస్తున్న పురోహితులు

జగన్నాథ స్వామి ఆలయ ధర్మకర్త ఎవరో?

నేత్రోత్సవంలో కానరాని ఇఒ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయంతో పాటు ఐదు ఆలయాలకు సింగిల్ ట్రస్టీ గా కార్యనిర్వాహక అధికారిగా రమేష్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఇఒగా రమేష్ ఈ ఆలయాలకు సింగిల్ ట్రస్టీ గా ప్రమాణం చేశారు. అంటే ఈ ఆలయాలకు సంబంధించిన ధూపదీప నైవేద్యాలు, యాత్రలు ఇఒ రమేష్ ఆధ్వర్యాన జరగాల్సి ఉంది. కానీ శనివారం పట్టణం లోని జగన్నాథస్వామి ఆలయం నేత్రోత్సవం యువరాజు విక్రమ చంద్ర సన్యాసి రాజు ఆధ్వర్యాన జరిగింది. ఈ ఉత్సవ ఏర్పాట్లు విక్రమ చంద్ర సన్యాసిరాజు పర్యవేక్షణలో జరిగాయి. ఇఒ రమేష్ మాత్రం ఈ ఉత్సవంలో ఎక్కడా కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. జగన్నాథ స్వామి రథయాత్రకు కొద్ది రోజుల ముందుగా నేత్రోత్సవం నిర్వహిస్తారు. స్వామి కళ్ళు కడిగే ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇఒ రమేష్ జాడ ఈ ఉత్సవంలో కనిపించకపోవడం వెనుక ఆంతర్యం అంతు చిక్కడం లేదు. నిన్న మొన్నటి వరకు జగన్నాథ స్వామి ఆలయం ధర్మకర్త ని తానేనని యువరాజు విక్రమ చంద్ర సన్యాసి రాజు చెప్పుకునే వారు. జగన్నాథస్వామి ఆలయం, రాధాకృష్ణ ఆలయం, సీతారామ స్వామి ఆలయం, సువర్చలా సహిత ఆంజనేయస్వామి వారి ఆలయం, పంచముఖేశ్వర స్వామి ఆలయాలకు సింగిల్ ట్రస్టీగా ఇఒ రమేష్‌ను నియమిస్తూ దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ దేవాలయాల ఆస్తుల పరిరక్షణ కూడా ఆయనే చూడాల్సిన అవసరం ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాలను పక్కన పెట్టి ఇఒ రమేష్ జగన్నాథ స్వామి ఆలయం నేత్రోత్సవం నిర్వహించకపోవడం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యువరాజు కుటుంబీకులతో ఇఒ కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వరహాల గెడ్డ ఆక్రమణలు తొలగించాలి

పూడిక పనులు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని వరహాలగెడ్డ, చెరువుల ఆక్రమణలు, బ్రిడ్జి పనులను తొలగించి, పూడికతీత పనులు చేపట్టాలని సిపిఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం పట్టణ కమిటీ శనివారం వరహాల గెడ్డపై నిర్మిస్తున్న కల్వర్టు పనులను, గెడ్డ పూడికలను పరిశీలిన అనంతరం పార్వతీపురం ఆర్‌డిఒ కార్యాలయ డిటి జెపి శ్రీనివాసరావుకు, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్‌కు ఆయా కార్యాలయాల్లో వినతిపత్రాలను శనివారం నాయకులు అందించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, నాయకులు బంకురు సూరిబాబు, పి.రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో చిన్న పాటి వర్షం పడినా ముంపు బారిన పడుతుందన్నారు. దీనికి ప్రధాన కారణం పట్టణ మధ్యలో ప్రవహిస్తున్న వరహాలగెడ్డ ఆక్రమణలేనన్నారు. ఈ ఆక్రమణల తొలగింపునకు అధికారులకు అనేక పర్యాయాలు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. వెంటనే వరహాల గెడ్డ ఆక్రమణలను తొలగించాలని, అలాగే వరహాల గెడ్డపై నిర్మిస్తున్న కాజ్‌వే పనులపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, వర్షాకాలం సందర్భంగా గెడ్డ పూడికలు తొలగించే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. వరహాలగెడ్డ వరద నీటి వల్ల పట్టణం తరచూ ముంపునకు గురవుతున్నందని అన్నారు. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ముంపు బారి నుంచి పార్వతీపురం పట్టణ ప్రజలను రక్షించాలని డిమాండ్ చేశారు. లేనిచో సిపిఎం ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు హెచ్.బలరాం, బెలగాం శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వరహాల గెడ్డ ఆక్రమణలపై కమిషనర్‌కు వివరిస్తున్న సిపిఎం నాయకులు



ఖాళీ బిందెలతో మంచినీటి ట్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న జల గ్రామస్తులు

మంచినీటి కొరతతో గిరిజనుల ఇక్కట్లు

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

మారుమూల గిరిజన గ్రామమైన జలలో మంచినీటి కొరతతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ జల గ్రామం రక్షిత మంచినీటి ట్యాంకు వద్ద ఖాళీ బిందెలతో సిపిఎం ఆధ్వర్యంలో గిరిజన మహిళలు నిరసన చేపట్టారు. గ్రామంలో ఉన్న బోరు ద్వారా 10 బిందెలు నీరు వచ్చిన తర్వాత బురదగా నీరు వస్తూ తాగడానికి కూడా పనికిరాని పరిస్థితి ఉందన్నారు. మంచినీటి ట్యాంకులో నీరు బాగా నాచుచేరి మండుటెండల వల్ల మోటార్‌కు కుండీలో నీరు అందకపోవడంతో గతంలో మాదిరిగా ట్యాంక్‌కు నీరందించే పరిస్థితి లేకపోవడంతో గడిచిన నెల రోజులుగా గిరిజనులకు పూర్తి స్థాయిలో తాగు నీరందక చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గిరిజనులు ఇంతగా ఇబ్బందులు పడుతున్నా స్థానిక సర్పంచ్ గానీ, సచివాలయం సిబ్బంది గానీ, ఐటిడిఎ అధికారులు గానీ, సంబంధిత అధికారులు కానీ గ్రామాన్ని సందర్శించి పర్యవేక్షణ చేయకపోవడం దారుణమన్నారు. ఈ గ్రామంలో 43 గిరిజన కుటుంబాలు జీవిస్తున్నాయని, వీరికి గడిచిన నెలరోజులుగా పూర్తిస్థాయిలో నీరు లేక బురద నీరు తాగుతూ మలేరియా, విష జ్వరాలకు భవిష్యత్తులో పాల్పడే పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జల గ్రామ గిరిజనులకు పూర్తిస్థాయిలో తాగునీరందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, గిరిజన సంఘం నాయకులు ప్రసాద్, చెంబుర నాగేశ్వరరావు, వెంకన్న, పలువురు గిరిజన మహిళలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - కొత్తవలస

జిందాల్ కార్మికుల సమస్య పరిష్కరించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం రెండో రోజుకు చేరాయి. జిందాల్ యాజమాన్యం లాకౌట్ పేరుతో కార్మికులను బయటకు నెట్టి నేటికి 37 రోజులు గడుస్తున్నా కనీసం స్పందించలేదని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. జిందాల్ టాప్ యాజమాన్యం దిగివచ్చి కార్మికులందరికీ భేషరతుగా పనిని కల్పించాలని కోరారు. గత 40 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యం ఇటువంటి శిక్ష వేయడం విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ కర్మాగారంలో లేని శిక్షను జిందాల్ యాజమాన్యం కార్మికులకు వేయడం విడ్డూరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జిందాల్ కర్మాగారంలో కార్మిక సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామని నాయకులు అన్నారు. జిందాల్ జెఎసి నాయకులు పిల్లా అప్పలరాజు (టిఎన్‌టియుసి), గాడి అప్పారావు (సిఐటియు) నాయకత్వంలో కార్మికులు రెండవ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో బర్ల అచ్చయ్యమ్మ, సింగంపల్లి నాయుడు బాబు, రాళ్లపల్లి సత్యనారాయణ, రొంగలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కిమిడి కుటుంబంపై సిఎంకు ఫిర్యాదు

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి వ్యతిరేకంగా పని చేశారని ఆరోపణ

రేగిడి+ సార్వత్రిక ఎన్నికల్లో రాజాం టిడిపి ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు వ్యతిరేకంగా పనిచేసిన రేగిడి మండలానికి చెందిన మాజీమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు సోదరుడు, కుమారులపై బహిష్కరణ వేటు వేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు అమరావతిలో రాతపూర్వకంగా శనివారం రాజాం టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాజాం పట్టణంలో ఓ కళ్యాణ మండపంలో నాలుగు మండలాల టిడిపి నాయకులు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి ఏకగ్రీవంగా బహిష్కరణ వేటుకు తీర్మానం చేశారు. రేగిడికి చెందిన మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతి, మాజీ జడ్‌పిటిసి కిమిడి రామకృష్ణంనాయుడు, టిడిపి అధ్యక్షులు కిమిడి వినయ్ కుమార్, సర్పంచ్ రవికుమార్‌లు 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి కాకుండా వైసిపికి అనుకూలంగా పనిచేశారని విమర్శలు వచ్చాయి. దీంతో అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు తీర్మానం చేశారు. మాజీ జెడ్‌పిటిసి కిమిడి రామకృష్ణం నాయుడు 1983 నుంచి టిడిపిలో క్రియాశీలక సీనియర్ నాయకులుగా వ్యవహరించి ఎన్నో పదవులు అలంకరించారు. రేగిడి మండలం ఎంపిపిగా, అతని సతీమణి వేణి సుందరం ఎంపిపిగా టిడిపిలో సేవలందించారు. 2014లో తన కుమారుడు మండల టిడిపి అధ్యక్షులు కిమిడి వినయ్ కుమార్ ఐదేళ్లపాటు మండలాన్ని శాసించారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్నప్పటికీ, రాజాం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యేగా పోటీ చేసిన కోండ్రు మురళీమోహన్‌కు వ్యతిరేకంగా పనిచేశారు. రేగిడి, ఆముదాలవలస, వెంకంపేట, రాజావలసతో పాటుగా పలు గ్రామాల్లో ఉన్న టిడిపి నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి టిడిపికి వ్యతిరేకంగా ఓటు వేసి వైసిపికి మెజార్టీ తేవాలని నాయకులకు సూచించారు.

పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట లేదా?

- ఒడిశా నుంచి యథేచ్ఛగా తరలింపు
- కాలినడకన రవాణా
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

ఒడిశా నుంచి ప్రతి వారం వందల సంఖ్యలో మూగజీవాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి. గత కొన్నేళ్లుగా పశువుల అక్రమ రవాణా కొనసాగుతోంది. సుమారు 300 నుంచి 400 కిలోమీటర్ల మేర నడిపించుకుంటూ జాతీయ రహదారి మీదుగా తరలిస్తున్నారు. ఒడిశాలోని కొరాపుట్, జయపురం, సిమిలిగుడ ప్రాంతాల నుంచి ఒడిశాలోని ఘాట్ రోడ్డు మీదుగా పాచిపెంట మండలం పి.కోనవలస చెక్ పోస్ట్ దాటించుకొని పశువులను రవాణా చేస్తున్నారు. శనివారం జరిగే మానాపురం సంతకు పెద్ద ఎత్తున పశువుల అక్రమ రవాణా కొనసాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్కడ నుంచి వారం వారం కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు పెద్ద పెద్ద కంటెయినర్లలో తరలిస్తున్నారు. గురు, శుక్రవారాల్లో పశువుల రవాణా జాతీయ రహదారి-26పై కనిపిస్తోంది. గతంలో బైపాస్ రోడ్డు లేకపోవడంతో సాలూరు పట్టణం నడిబొడ్డు మీదుగా పశువుల రవాణా సాగేది. బైపాస్ రోడ్డు వినియోగంలోకి రావడంతో సాలూరు, రామభద్రపురం మీదుగా రవాణా జరుగుతోంది. దీనిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

మాఫియా కనుసన్నల్లో పశువుల రవాణా



కాలినడకన తరలిపోతున్న పశువులు

ప్రతివారం వందల సంఖ్యలో మూగజీవాలు అక్రమ రవాణా సాగుతుండడం వెనుక జాతీయ స్థాయిలో మాఫియా హస్తం వున్నట్లు తెలుస్తోంది. కోట్లాది రూపాయల విలువ చేసే పశువులను కబేళాలకు తరలించి అక్కడ నుంచి పశువుల మాంసాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. పశువుల రవాణా చేసే దారి పొడవునా అధికారులకు లంచాలు ఇచ్చుకుంటూ వ్యాపారులు వెళుతుండడం వల్లనే చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒట్టిపోయిన ఆవులు, ఎద్దుల ను ఎక్కువగా రవాణా చేస్తున్నారు.

ఆశల పల్లకిలో అన్నదాత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ఓవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు చీడపీడల దాడి, ఇంకోవైపు చేతికందే పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, మార్కెటింగ్ సదుపాయమూ లేక ఏటా నష్టాలపాలవుతున్న అన్నదాత కొత్త ప్రభుత్వంలోనైనా కాస్తంత ఆర్థిక సాయం పెరుగుతుందని, సకాలంలో బ్యాంకు రుణాలు అందుతాయని ఆశగా ఎదురు చూస్తున్నాడు. ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు 20వేల వరకు ఆర్థిక సాయం అందిస్తామంటూ టిడిపి అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్రంతోపాటు ఉమ్మడి విజయనగరం జిల్లాలో టిడిపి, జనసేనకు బంపర్ మెజార్టీతో మొత్తం 11 అసెంబ్లీ స్థానాల్లోనూ గెలిపించారు. ఇందులో ఇద్దరు మంత్రులుగా కొలువుదీరారు. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం కూడా పూర్తయ్యింది. మరోవైపు రుతుపవనాల ఆగమనంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి.

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటికే రైతులు ఖరీఫ్ విత్తనాలు వేసేందుకు దుక్కులు దున్నారు. నారు మడులు తయారవుతున్నాయి. విత్తనాలు సమకూర్చుకోవాల్సిన సమయమిది. వీటన్నింటికీ డబ్బే ప్రధానం. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఇస్తామన్న రూ.20వేల సాయం కోసం చూస్తున్నారు. మరోవైపు ఖరీఫ్ బ్యాంకు రుణాలపై అధికార యంత్రాంగంలో ఇప్పటికీ కదలిక లేదు. వరితో పాటు మిగిలిన వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కంటితుడుపుగానే ఉంది. ఈ నేపథ్యంలో అందరికీ అన్నంపెట్టే రైతన్న ఆశ, నిరాశతో ఎదురు చూస్తున్నాడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా 4, 52,685 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ఇందులో ఖరీఫ్ సీజన్ అత్యంత కీలకమైనది. ఒక్క ఈ సీజన్‌లోనే అత్యధికంగా 3,01,247 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. ఇందులో ప్రధానంగా వరి, మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు పంటలు ఉన్నాయి. ఇందులోనూ 2,34,550 ఎకరాల్లో వరి సాగు ఉంది. తద్వారా 4.82లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఈ ఏడాది ఉత్పత్తి అవుతాయని అధికారులు అంచనా రూపొందించారు. ఇటువంటి పరిస్థితుల్లో తక్షణమే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని, లేదంటే సాగు కష్టమేనని రైతుల్లో చర్చనడుస్తోంది. వాస్తవానికి వైసిపి ప్రభుత్వం హయాంలో రైతు బరోసా పేరిట ఏటా మూడు దఫాలుగా రూ.13,500 రైతులకు అందజేశారు. కానీ, అనేక నిబంధన లు పెట్టడంతో అర్హులైన వేలాది మంది సాయానికి నోచుకోలేదు. విజయనగరం జిల్లాలో 3,63,294 మంది రైతులు ఉండగా, 2,32,704 మందికి మాత్రమే ఈ పథకం వర్తింపజేశారు. 1,421 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించినప్పటికీ, మిగిలిన వారిలో ఎంతో మంది అర్హులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది కౌలు రైతులు భూ యజమానుల నుంచి నిరభ్యంతర పత్రాలు తెచ్చుకోలేకపోవడంతో సాయానికి దూరం కావాల్సివచ్చింది. కొంతమందికి సాంకేతిక సమస్యలతో ఐదేళ్లు ఎదురు చూపులే మిగిలాయి. ఈ సారైనా నిబంధనలు సడలించి, తమను ఉదారంగా ఆదుకోవాలని రైతులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.


యోగా చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

యోగాతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - సీతంపేట

యోగాతో మానసిక ఉల్లాసం ఉంటుందని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుశాంత్ జెనా అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగా ప్రతి మనిషికి అవసరమని చెప్పారు. యోగా చేసే మనిషికి మానసిక ఒత్తిడి ఉండదన్నారు. శరీరం దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగా అవసరమని, ఇదే పరిపూర్ణంగా ఉంటూ ప్రవహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కెవెల్ ప్రభాకరరావు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.


జెసిబితో పారిశుధ్యాన్ని తొలగిస్తున్న సిబ్బంది

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలో శనివారం జెసిబి ద్వారా ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. కూరకుల వీధి నుంచి సిబిఎం వీధి వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలో గల కొన్నేళ్లుగా చెత్తా చెదారం తొలగించకపోవడంతో వర్షం కురిసినప్పుడల్లా రోడ్లపై మురికి నీరు పారుతుంది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని మేజర్ పంచాయతీ ఇన్చార్జి ఇఒ పి.రాము ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు.

కడకెల్లలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం కడకెల్లలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం జి.హేమ, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

రిటైర్డ్ ఉద్యోగికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -భామిని

స్థానిక ఆదర్శ పాఠశాలలో నైట్ వాచ్‌మేన్‌గా నిమ్మల మనోహర పదేళ్లసేవలు అందించి, ఏప్రిల్ 30న పదవి విరమణ చేశారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఆదర్శ పాఠశాలలో పనిచేయడం వల్ల ఆయనకు ప్రభుత్వం ద్వారా ఎలాంటి ఆర్థిక సాయానికి అర్హుడు కాకపోవడంతో పాఠశాలలోని ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు విరాళాల ద్వారా రూ.లక్ష 20వేలు సేకరించి ఆర్థిక సాయం శనివారం ఉపాధ్యాయులు ఆయనకు అందజేశారు. అనంతరం పాఠశాలలో మనోహర్‌కు శాలువాతో సత్కరించి, సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్, ఉపాధ్యాయులు, ఇతర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రెండు తులాల బంగారం అపహరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని హుస్సేన్ పురానికి చెందిన ఐదాల తవిటమ్మ మెడలోని రెండు తులాల బంగారం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం తవిటమ్మ తమ స్వగ్రామం నుంచి బొడ్డపాడు మీదుగా కాలువ గట్టుపై పాపంపేట వెళ్తుండగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను వెంబడించారు. ఎవరూ లేని సమయంలో మాస్కులతో మెడలో ఉన్న రెండు తులాల బంగారాన్ని అపహరించుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. సుమారు రెండు లక్షల రూపాయలు ఉంటుందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆర్.రెల్లయ్య తెలిపారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలి

నెల్లిమర్ల: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్లకి ఈ నెల 25వ తేదీలోపు నెల్లిమర్ల గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీమతి కె.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీన విద్యార్థులు ఏ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చేరాలని అనుకుంటున్నారో వారు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదే పాఠశాలలో ప్రవేశ పరీక్ష 27వ తేదీన జరుగుతుందని, ప్రవేశ పరీక్షకు ఆధార్ కార్డు జిరాక్స్‌తో హాజరు కావాలని కోరారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారని చెప్పారు.

24న మెగా రక్తదాన శిబిరం

బొబ్బిలి : ఈ నెల 24న ఎమ్మెల్యే బేబినాయన జన్మదినం సందర్భంగా కోటలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, అవేర్ ఫౌండేషన్ అధ్యక్షులు పి.మనోజ్ కుమార్, ఎఎంసి మాజీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు తెలిపారు. రక్తం కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడడంతో రక్తం నిల్వలు పెంచేందుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. రక్తదాన శిబిరంలో రక్తదాతలు, యువకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బి.సురేష్, కె.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కళా వెంకటరావు రాక

చీపురుపల్లి: స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆదివారం చీపురుపల్లి వస్తున్నట్లు టిడిపి శ్రేణులు తెలిపాయి. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో బొత్స సత్యనారాయణపై టిడిపి తరపున పోటీ చేసి కళావెంకటరావు విజయం సాధించారు. కాగా ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి మొదటి సారి చీపురుపల్లి వస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నాయకులు కళా వెంకటరావుకి ఘనస్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

మెంటాడ : మెంటాడ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై శనివారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆండ్ర ఎస్ఐ ఎ.దేవి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వాటిపట్ల అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వాటిజోలికి వెళ్లొద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'నేను బడికి పోతా'

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చిన్న బగ్గ, పూతికవలస గ్రామాల్లో శనివారం గిరిజన సంక్షేమశాఖ డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ నారాయుడు ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు బడిలో... పెద్దలు పనిలో అన్న నినాదాలు చేశారు. ఎంఇఒ కోటేబాబు, సిఎంఒ చిరంజీవులు తదితరులు గ్రామాల్లో పర్యటించి డ్రాపౌట్ విద్యార్థులు లేకుండా అందరిని పాఠశాలలో చేర్పించే బాధ్యత అందరూ తీసుకోవాలని తెలియజేస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శారద, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, పిల్లల్ని పాఠశాలకు పంపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవానంద్ అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పాఠ్యపుస్తకాలు పట్టించి ర్యాలీ నిర్వహించారు. విద్యకు ఉన్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలని, బాగా చదువుకుంటే ఉన్నత శిఖరాలకు వెళ్లొచ్చని అన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, విద్యార్థులను ప్రోత్సహించేందుకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేస్తుందన్నారు. బాగా చదువుకున్న ఉత్తమ విద్యార్థులకు స్కాలర్ షిప్పు ఇస్తూ ఆర్థికంగా భరోసా కల్పిస్తుందన్నారు. చిన్నారులు బాల కార్మికులు కాకుండా భవిష్యత్తును తీర్చిదిద్దే మార్గదర్శకులు కావాలని పిలుపునిచ్చారు.



సీతంపేట: ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


గుమ్మలక్ష్మీపురం : నినాదాలు చేస్తున్న విద్యార్థులు

గిరిజన ఆశ్రమ పాఠశాలను ప్రారంభించాలి

సాలూరు: పట్టణంలో గతేడాది మంజూరైన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వై నాయుడు, పట్టణ కమిటీ సభ్యులు టి.రాముడు కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ 2023 సెప్టెంబర్‌లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల మంజూరు చేశారని చెప్పారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతిగృహాలకు కిటికీలు, తలుపులు, ప్రహరీగోడలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను వెంటనే నియమించాలని, సరిపడా మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్. పాఠశాలలకు రెగ్యులర్ హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్లను నియమించాలని కోరారు. కలెక్టర్, ఐటిడిఎ పిఒ చొరవ తీసుకుని వెంటనే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ప్రారంభించాలని కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఎం పట్టణ కమిటీ నాయకులు టి.శంకరరావు, ప్రసాదరావు ఉన్నారు.

నిర్వహణ నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండల విద్యాశాఖ కార్యాలయాల నిర్వహణ గ్రాంట్ (ఎంఆర్‌సి గ్రాంట్)ను విడుదల చేయాలని మండల విద్యాశాఖ అధికారులు-1 అసోసియేషన్ ఎపి రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రవినాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి నారా లోకేష్‌కు లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు సింహాచలం తెలిపారు. ఎంఇఒ కార్యాలయాల నిర్వహణకు ప్రతి ఏటా ఎంఆర్‌సి గ్రాంట్ సమగ్ర శిక్ష ద్వారా మంజూరు చేస్తారని, అయితే గత విద్యా సంవత్సరం 2023-24 నుంచి నిర్వహణ గ్రాంట్స్ విడుదల చేయకపోవడంతో ఎంఇఒలు ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఆఫీసు నిర్వహణకు సంబంధించిన విద్యుత్, ఇంటర్నెట్ చార్జీలు, స్టేషనరీ ఖర్చులతో పాటు వివిధ విద్యా కార్యక్రమాల నిర్వహణకు ఎంఇఒలు సొంత డబ్బు వెచ్చించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఈ సమస్యను విద్యామంత్రి దృష్టికి లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేశామన్నారు. త్వరలోనే మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవిస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న విజయగౌరి

ఆడపిల్లను చదివిద్దాం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని చినమేరంగి ప్రభుత్వోన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి విజయగౌరి ఆధ్వర్యంలో శనివారం భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలోని యుక్త వయసు గల ఆడపిల్లలకు భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు, వాటి అనర్థాలు, లింగం వివక్షత మొదలైన పలు అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్వాడీల ఆవశ్యకత అనే అంశాలను కూడా వివరించారు. అంగన్వాడీ సూపర్ వైజర్ పి.జానకి, స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె. ముత్యాలు, మహిళా పోలీస్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - పాచిపెంట

పత్తి పంట ప్రస్తుతం 15 నుండి 25 రోజుల వయస్సు ఉందని, కావున రైతులు సరైన విధానంలో ఎరువులతో పాటుగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని మాతుమూరు రైతు భరోసా కేంద్రం పరిధిలో పత్తి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం రైతులు ఎక్కువగా బిటి రకాలను పండిస్తుండడం వల్ల రసం పీల్చు పురుగుల బెడద ఎక్కువగా ఉంటుందన్నారు. ముందుగా ఐదు శాతం వేప కషాయం లేదా వేప నూనె ఒక లీటర్ నీటికి ఐదు మిల్లీలీటర్లు కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. భూమిలో సరైన తేమ లేకపోవడం వల్ల రైతులు ఎరువులు వేయడం ఆలస్యం చేస్తున్నారన్నారు. డిఎపి లేదా కాంప్లెక్స్ ఎరువులను ఆఖరి దుక్కిలోనే వేయాలని, అలా వేయకపోతే వేరు వ్యవస్థ సరిగా అభివృద్ధి చెందదని అన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపిస్తుందని తెలిపారు. సరైన వేరు శాతం ఉన్నప్పుడు రైతులు ఎకరాకు డిఎపి 25 కిలోలు, యూరియా 25 కిలోలు, పొటాష్ 15 కిలోలు వేసుకోవాలని సూచించారు. అక్కడక్కడ కాండం తొలుచు వివిల్ పురుగు నష్టం కనిపిస్తుందని, నివారణకు కార్బో ఫిరాన్ గుళికలు వేసుకో వాలని తెలిపారు. వీలైనంత త్వరగా మొదటి దఫా ఎరువులు వేసుకోవాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో యూరియా, డిఎపి, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ దినేష్ కుమార్ పాల్గొన్నారు.


పాచిపెంట: పంటను పరిశీలిస్తున్న ఎఒ

మెట్టుసాగు... ఈ నెలాఖరులో మేలు...

సాలూరురూరల్: మెట్ట పంటలైన పత్తి, మొక్కజొన్న పంటలను ఈనెల చివరి వారంలో నాటినట్లయితే నాటే ప్రతి విత్తనం మొలకెత్తుతుందని మండల వ్యవసాయ అధికారి అనురాధ పండా తెలిపారు. మండలంలోని శివరాంపురంలో శనివారం జరజాపు పైడిపునాయుడు, బొడ్డు ఆదినారాయణకు సంబంధించిన వ్యవసాయ క్షేత్రంలో పత్తి, మొక్కజొన్న వేసిన పొలాల్లో ఆమె క్షేత్ర పరిశీలన చేశారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు పంటలు విత్తుకోవడంతో మొలకలు సరిగా రాక మొలక శాతం తగ్గిందన్నారు. ఎండలు కూడా అధికంగా ఉండడం, భూమి వేడెక్కడంతో విత్తనం జీవ శక్తి కోల్పోయి మొలకెత్తడం లేదన్నారు. గతంలో కురిసిన అధిక గాలి, వర్షం వల్ల మొలకెత్తిన మొక్కలు కూడా చనిపోతున్నాయన్నారు. పొలాల్లో లోతట్టు ఉన్న ప్రాంతాల్లో నీరు నిలబడడంతో మొలకెత్తిన మొక్కలు చనిపోతాయన్నారు. సరైన వాతావరణం లేక మొలక శాతం తగ్గిందని, కావున రైతులు విత్తనాలు వేసే ముందు అన్నిలా భూమి చల్లబడినప్పుడు మాత్రమే విత్తనాలు వేయాలని ఆమె కోరారు


సాలూరు రూరల్: పంటను పరిశీలిస్తున్న ఎఒ అనురాధ పండా

కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలి

ఎంపిపి బొంగు సురేష్

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని పంచాయతీ కార్యదర్శులు బాధ్యతాయుతంగా పని చేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఎంపిపి బొంగు సురేష్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. టిడిపి పార్టీ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు సారథ్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం ఇస్తున్న నిధులను ప్రతి పైసా ఆయా పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేయాలని తద్వారా గత ప్రభుత్వంలో భ్రష్టు పట్టిన ప్రతి గ్రామం పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగాలన్నారు. ఇంతవరకు సచివాలయం ఉద్యోగులు విధులకు ఎగ్గొట్టి ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఇకపై వారి ఆటలు సాగవని హెచ్చరించారు. భారత రాజ్యాంగం సర్పంచ్, ఎంపిటిసిలకు గ్రామ స్థాయిలో ఇచ్చిన గౌరవాన్ని, విలువలను కాలరాసే హక్కు ఏ ఒక్క రాజకీయ పార్టీకు లేదని పంచాయతీల అభివృద్ధి వారితోనే సాధ్యమని గుర్తు చేశారు. మండలంలో 6 గురు ఎంపిటిసిలు, 17 మంది సర్పంచులు ఉన్నారన్న సంగతి ఏ ఒక్క కార్యదర్శికైనా తెలుసునా అని ప్రశ్నించారు. దత్తి లక్ష్మణరావు మాట్లాడుతూ కార్యదర్శులు, ఎంపిడిఒ సూచనలు సలహాలు పాటించి సమన్వయంతో కలిసి పనిచేయాలని తెలిపారు. పాత బాణీకి స్వస్తి చెప్పి ప్రభుత్వం నుంచి లబ్దిదారులకు అందించే ప్రతి పథకాన్ని గ్రామంలో స్థానిక సర్పంచ్, ఎంపిటిసిలకు తెలియజేస్తూ వారి అనుమతి మేరకు వ్యవహరించాలని, వారు లేని పక్షంలో టిడిపి నాయకుల అభీష్టం మేరకు మాత్రమే ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించాలని హుకుం జారీ చేశారు. కుదమలో సచివాలయ నూతన భవనం ఎన్నికల కోడ్ 7వ తేదీన ముగియనుండగా, పంచాయతీ కార్యదర్శి 3వ తేదీన కనీసం స్థానిక సర్పంచ్, ఎంపిటిసిలకైనా తెలియజేయకుండా ప్రారంభించారని, అసలు నిన్నెవరు ప్రారంభించమన్నారని కార్యదర్శిపై మండిపడ్డారు. వెంటనే సచివాలయానికి తాళం వేయాలని, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరితో కుదమ సచివాలయాన్ని లాంఛనంగా ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపిపి సురేష్

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. జిల్లా కేంద్రంలో శనివారం పట్టణంలో ఏడో వార్డులో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పిల్లల్లో ఎవరికైనా జ్వరాలు, సీజనల్ వ్యాధులు నమోదయ్యాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రానున్న రెండు నెలలు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అంగన్వాడీ కేంద్రంలోనూ, చుట్టుపక్కల పరిసర ప్రాంతంలోనూ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ముఖ్యంగా పట్టణాల్లో ప్రస్తుత సీజన్లో డెంగీ జ్వరాలకు ఆస్కారం ఉన్నందున జ్వర లక్షణాలను గుర్తిస్తే వెంటనే జిల్లా ఆసుపత్రిలో డెంగీ నిర్ధారణ కేంద్రంలో (ఎస్ఎస్ హెచ్) పరీక్షలు జరిపించాలన్నారు. అలాగే జ్వర లక్షణాలను బట్టి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. చిన్నారుల తాగు నీటి పరిశుభ్రంగా ఉండాలని, ఆహార పదార్థాలపై మూతలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్య నిర్వహణ రికార్డులో బరువు, ఎత్తు, శారీరక ఎదుగుదల వివరాల నివేదికలు పరిశీలించి, వాటి సాధారణ, అసాధారణ స్థితిని అక్కడ స్వయంగా పిల్లల బరువు తనిఖీ చేసి సరిచూశారు. ప్రతి నెలా పురోగతి లేనట్లు గుర్తిస్తే ఎన్ఆర్‌సి కేంద్రంలో చేర్చాలని, వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పిల్లల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అనంతరం డిఎంఒ డ్రైడే కార్యక్రమం ఏ మేరకు నిర్వహిస్తున్నారో వార్డులో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, ఎఎన్ఎం కిరణ్మయి, అంగన్వాడీ టీచర్ లత, సిబ్బంది తదితరులు ఉన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎంఒ



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఘనంగా వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా చీఫ్ గెస్ట్ కె.పాపారావు, గొల్లప్రోలు మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా ఏకకాలంలో ఏడు రకాల సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. ప్రధానంగా వాసవీ క్లబ్ సభ్యులు నలుగురు నేత్రదానం ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. ఐపిసి కార్యదర్శి ఎం.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామని, పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బ్యాగులకు సంబంధించి కిట్లను 50 మందికి అందజేశామన్నారు. అలాగే పోలీస్ శాఖకు సంబంధించి నాప్టిన్లు బిస్కెట్లు, పెన్నులు అందజేశామన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ ఎ.గోవిందరాజు, కార్యదర్శి కె.లక్ష్మణరావు, కోశాధికారి కె.వెంకటరాజు, రీజనల్ సెక్రటరీ ఎ.సత్యనారాయణతో పాటు వాసవీ క్లబ్ సభ్యులు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు బడికి వచ్చేలా కృషి చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం


14 ఏళ్లలోపు గల చిన్నారులు పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు తగిన మేరకు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, ఎటిడబ్ల్యూఒ సురేష్ కుమార్ కోరారు. శనివారం స్థానిక ఎపి గిరిజన గురుకుల (పిటిజి) బాలికల పాఠశాలలో కొమరాడ, గుమ్మ లక్ష్మీపురం మండలాలకు చెందిన అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. జూన్ 13న పాఠశాలలు పునః ప్రారంభించిన మేరకు ఏ గ్రామంలో కూడా విద్యార్థులు డ్రాప్ అవుట్స్‌గా ఉండకూడదని అన్నారు. 14ఏళ్ల లోబడిన పిల్లలు షాప్స్, సంస్థలు, వాణిజ్య సంస్థలు, హెూటల్స్, సినిమా హాలులో, మెకానిక్ షెడ్స్, రెడీ మేడ్ దుకాణాలు, కిరాణా షాప్‌లు, డిపార్ట్మెంట్ స్టోర్‌లు, వెల్డింగ్ షాప్‌లు, తోపుడు బండ్లు, మోటార్ రవాణా వంటి ప్రమాదరహిత ప్రదేశాల్లో పని చేయకుండా పాఠశాలల్లో ప్రవేశాలను కల్పించాలని అన్నారు. అలాగే 18 ఏళ్లలోపు బాల బాలికలను ఎవరూ పనిలోపెట్టుకోకూడదని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది పాఠశాలలు పునః ప్రారంభం నాటిక సుమారు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బూట్లు, బ్యాగులు యూనిఫామ్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ మేరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సాధ్యమైనంత మేరకు విద్యార్థులకు పంపిణీ చేయాలని కోరారు. కొత్తగా ప్రవేశాలు పొందిన విద్యార్థుల పేర్లను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. పాఠశాలలు వసతిగృహాల్లో ఎటువంటి అపారిశుధ్యం లేకుండా చూడాలని సూచించారు. పాఠశాలకు చెందిన రికార్డులను అప్‌డేట్‌గా ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో రెండు మండలాలకు చెందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎటిడబ్ల్యూఒ సురేష్‌కుమార్

ఘనంగా జగన్నాథుడి శోభాయాత్ర

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జులై 7న జరగనున్న జగన్నాథస్వామి రథయాత్రను పురస్కరించుకొని జగన్నాథ స్వామికి జరిగే శోభ రథయాత్రలో భాగంగా పట్టణ ప్రధాన రహదారికి ఆనుకొని దంగిడి వీధి కూడలి వద్ద ఉన్న స్థానిక జగన్నాథ స్వామి ఆలయంలో శనివారం 'కన్ను కడుగుట' కార్యక్రమం దేవాలయ అనువంశిక పూజారులు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇఒ ఎం.ప్రసాద్ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పట్టణంలోని ఒరియా బ్రాహ్మణులతో పాటు, పట్టణంలో చాలామంది ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం ఐటిడిపిపి కో ఆర్డినేటర్ బార్నాల సీతారాం, జగన్నాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ పాలవలస శ్రీనివాసరావు, టిడిపి ముఖ్యకార్యకర్తలు సిరిపురం భాష, సారికి గణేష్, రాపాక అనంత్, మండల ప్రసాద్, రామ, పోలిరాజు, కాకర్ల గంగరాజు పాల్గొన్నారు. తొలుత జగన్నాథ స్వామి రథం తయారు చేస్తుండడంతో స్వామి వారి శోభారథాన్ని పరిశీలించి, తయారు చేస్తున్న విశ్వబ్రాహ్మణులను వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు.


మొక్కులు తీర్చుకుంటున్న యాత్రికులు

ఏజెన్సీలో విత్తన పండగ

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీలో గత రెండు రోజులుగా గిరిజనులు సేకరించిన కంది, వరి, కొర్రలు, రాగులు, జొన్నలు తదితర పంటలకు పండగ నిర్వహిస్తూ ప్రారంభిస్తారు. ఇప్పటికే జల్లారా, సామరెల్లి తదితర గ్రామాల్లో విత్తన పండుగ గిరిజనులు ప్రారంభించారు. ఈ విత్తన పండుగ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు నడుమ నిర్వహిస్తున్నారు. విత్తన పండుగ గిరిజనులు వస్త్రాలు ధరించి పితృదేవతలకు కొలుసుకొని పంటలు బాగా పండాలని, వ్యవసాయం బాగుండాలని పిల్లలు పశు సంపద పెద్దలు ఆరోగ్యంగా ఉండాలని, పితృదేవతలను కొలుస్తారు.


వేశధారణలో గిరిజనులు సందడి